కలెక్టర్, ఎస్పీలతో విదేశీ బృందం ప్రతినిధులు

సూరారంలో విదేశీ ప్రతినిధుల పర్యటన

సదాశివపేట, ఏప్రిల్ 25: మండలంలోని సూరారంలో 25 మంది విదేశీ ప్రతినిధులు పర్యటించారు. రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు తీరును సమీక్షించేందుకు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధుల బృందం శుక్రవారం పర్యటించింది. బృందం వెంట పంచాయతీ శాఖ కమిషనర్ సృజన, అధికారులు ఉన్నారు. విదేశీ ప్రతినిధుల బృందానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి స్వాగతం పలికారు. ఉపాధిహామీ పథకానికి అనుసంధానంగా గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో లబ్ధి పొందుతున్న కార్మికులతో మాట్లాడారు. ఉపాధి అవకాశాలు, వేతన చెల్లింపులు, మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై సమగ్ర సమాచారం సేకరించారు. విదేశీ బృందం పర్యటన సందర్భంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, కలెక్టర్, ఫీల్డ్ అసిస్టెంట్లు విదేశీ బృందానికి నీటి సంరక్షణ, పల్లె ప్రగతి కింద చేపడుతున్న పనులు, సామాజిక తనిఖీపై వివరించారు. విదేశీ ప్రతినిధులు తెలంగాణలో పథకం అమలు తీరును మెచ్చుకున్నారు. ప్రత్యేకించి డిజిటల్ మానిటరింగ్ విధానాలు, పారదర్శక చెల్లింపుల వ్యవస్థలు, మహిళల భాగస్వామ్యం వంటి అంశాలను వారు ప్రశంసించారు. తెలంగాణలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ గ్రామీణ అభివృద్ధికి ఒక ఆదర్శంగా నిలుస్తుందని బృందం సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశాల్లో లేని ఉపాధి హామీ పథకం భారత్‌లో మాత్రమే ఉందని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వంద రోజులు పని కల్పించడం గొప్ప విషయమన్నారు. అంతకుముందు ఉపాధిహామీ పథకంలో చేసిన పనులతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో ఎస్పీ పరితోష్‌పంకజ్, అదనపు కలెక్టర్లు మాధురీ, అడిషనల్ కమిషనర్ శేషుకుమార్, ఎస్‌పీఎం మురళి, డీఆర్డీఏ పీడీ జ్యోతి, అదనపు డీఆర్‌వోలు బాలరాజు, జంగారెడ్డి, ఎన్జీవో ప్రతినిధులు వర్షిని, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఓపెన్ స్కూల్ పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 25: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశం పొందిన అభ్యాసకులకు వారంరోజులుగా జరిగిన వార్షిక పరీక్షలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు పదో తరగతికి సంబంధించి మధ్యాహ్నం జరిగిన హోం సైన్స్ పరీక్షకు 65 మందికి 53 మంది హాజరయ్యారు. 12మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు 82శాతం హాజరు నమోదైంది. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఉదయం జరిగిన అర్థశాస్త్రం పరీక్షకు 2,845 మంది అభ్యాసకులకు 2633 మంది హాజరయ్యారు. 212 మంది గైర్హాజరయ్యారు. దీంతో 93శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన జీవశాస్త్రం, అకౌంటెన్సీ, హోంసైన్స్ పరీక్షలకు 495 మందికి 452 మంది అభ్యాసకులు హాజరయ్యారు. 43 మంది గైర్హాజరయ్యారు. దీంతో 91శాతం హాజరు నమోదైంది. పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు, కమిటీ పర్యవేక్షించింది. మాల్‌ప్రాక్టీసింగ్‌కు పాల్పడుతూ ఇద్దరు డీబార్ అయ్యారని డీఈవో వెల్లడించారు.

నల్లవల్లి జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మహిళలు

80వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, ఏప్రిల్ 25: ప్యారానగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా రైతు జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 80వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతున్న డంపింగ్ యార్డు వద్దని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రైతు జేఏసీ నాయకులు కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 80వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో మహిళా జేఏసీ నాయకులు, గ్రామస్తులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 80 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, యంత్రాంగం స్పందించకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు ఉపసంహరించుకోవాలని వేడుకున్నారు. దీక్షలో మహిళలు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మర్వెల్లిలో మాట్లాడుతున్న ఎంఈవో గోవింద్‌రెడ్డి

శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వట్‌పల్లి, ఏప్రిల్ 25: తెలంగాణ రైజింగ్ వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గోవింద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మర్వెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశానుసారం ఎంఈవో గోవింద్ రెడ్డి, మండల నాయకులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవి సెలవుల్లో విద్యార్థులు అమూల్యమైన అవకాశంగా భావించి వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొని ప్రతిభను చాటుకోవాలన్నారు. విద్యార్థుల ప్రతిభకు అనుగుణంగా సంగీతం, శాస్త్రీయ సంగీతం, చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాసం, కుట్లు, అల్లికలు, చదరంగం, ఇండోర్ గేమ్స్, టీఎల్ఎం తయారీ, యోగా, ధ్యానం అందుబాటులో ఉన్నాయన్నారు. 8 ఏండ్ల నుంచి 18ఏండ్ల బాలబాలికలకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి, మండల ఉపాధ్యాయులు, మండల నాయకులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్లు వేయించాలి

గోశాలలో వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్

పటాన్‌చెరు రూరల్ 25, ఏప్రిల్ 25: పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్లు వేయించాలని పశు సంవర్ధక శాఖ కేంద్ర ప్రభుత్వ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నందిగామలోని శ్రీరామ జీవసదన్ గోశాలలో ఆవులు, దూడలకు ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశుసంవర్ధక శాఖ అధికారి శైలెంద్ర జైస్వాల్ వద్ద విజయ్‌కుమార్ వ్యాక్సినేషన్ వివరాలు సేకరించారు. మండలంలో 5వేల 250 పశువులున్నట్లుగా తెలిపారు. గోశాలలోని 386పశువులకు గాలికుంటు వ్యాక్సిన్లు వేస్తున్నామని తెలిపారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు వేస్తున్నదన్నారు. భారత్ పశుధన్ యాప్ ఉందని, దానిని రైతులు డౌన్‌లోడ్ చేసి పశువులకు అధికారులు ఇచ్చే ట్యాగ్ నెంబర్‌ను, రైతు ఆధార్ నెంబర్‌ను, ఫోన్ నెంబర్‌ను అప్‌లోడ్ చేయాలని సూచించారు. మే 15వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం తెలంగాణలో కొనసాగుతుందన్నారు.

కుంభమేళాను తలపించేలా రజతోత్సవ సభ

జిన్నారం, ఏప్రిల్ 25: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ 25 వసంతాల రజతోత్సవ సభ కుంభమేళాను తలపించేలా చరిత్రలో నిలిచిపోనుందని తెలంగాణ ఉద్యమకారుడు, యువనాయకుడు వెంకటేశం గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నల్తూరులో నిర్వహించిన రజతోత్సవ సభ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ 15 నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని సీఎం రేవంత్ ప్రజల్లో అభాసు పాలవుతున్నాడని విమర్శించారు. వానకాలం రైతుబంధు ఎగ్గొట్టి యాసంగి కోతలు షురూ అయినప్పటికీ ఇవ్వకుండా రైతులకు మాయమాటలు చెబుతూ మోసం చేస్తున్నాడన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల అమలు ఊసే లేదన్నారు. రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ అంటేనే ప్రజలకు భరోసా అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్షగా నిలుస్తారన్నారు. ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. రజతోత్సవ సభలో కేసీఆర్ ఏమి మాట్లాడతారోనని ప్రజల్లో విపరీతంగా చర్చ కొనసాగుతుందని, ఆయన ప్రసంగం వినేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. రజతోత్సవ సభకు దండుగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాజేశ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, శివరాజ్, నరేందర్, ఆంజనేయులు, జనార్దన్, శ్రీనివాస్ రెడ్డి, రాజు, రామకృష్ణ, ఖదీర్, శ్రీనివాస్ గౌడ్, నరసింహారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, శాంత వర్మరెడ్డి, బ్రహ్మేందర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్, గులాబీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్తూరులో రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుడు వెంకటేశం గౌడ్

నారాయణఖేడ్ మండలం పలుగు తండాలో చలో వరంగల్ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న తండావాసులు

నాడు దీక్షకు.. నేడు సభకు...

నారాయణఖేడ్, ఏప్రిల్ 25: నారాయణఖేడ్ మండలం పలుగుతండాకు ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. సందర్భమేదైనా తెలంగాణ కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అడుగులో అడుగేసి వెంట నడిచిన తండా ఇది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపడితే తండాలో కూడా స్థానికులు దీక్షలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జరుగుతున్న జాప్యాన్ని జీర్ణించుకోలేక అమరవీరులు చేసుకున్న ఆత్మబలిదానాలకు చలించిపోయిన తండాలోని పిల్లలు సైతం ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిరసన తెలిపిన విషయాన్ని స్వయంగా మాజీ సీఎం కేసీఆర్ ఓ సందర్భంలో ప్రస్తావించడం విశేషం. ఒకటి రెండు కాదు ఉద్యమ సమయంలో కేసీఆర్ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టిన పలుగుతండా పేరు అప్పట్లో జిల్లా వ్యాప్తంగా మారుమోగింది. బీఆర్ఎస్‌తో ఇంతగా మమేకమైన పలుగుతండా ఎల్కతుర్తిలో కేసీఆర్ సభ కోసం తండావాసులంతా కదులుతున్నారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం తండాలో సమావేశమై సభకు బయలుదేరి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ఇదే సందర్భంగా కేసీఆర్ ఉద్యమ ప్రస్తానం, పదేండ్ల సుపరిపాలన, ఎల్కతుర్తి బహిరంగసభను స్ఫూరింప జేస్తూ చలో వరంగల్ ఫ్లెక్సీని తండాలో ఆవిష్కరించారు.

హోతిబీలో సీసీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

గ్రామాల అభివృద్ధికి కృషి

జహీరాబాద్, ఏప్రిల్ 25: గ్రామాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాయిపల్లి డి, హోతి–బీ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల చొప్పున మంజూరైన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్,గుండప్ప, పర్వేజ్, చిన్నరెడ్డి, రాములు, గోవర్ధన్‌రెడ్డి, అమిత్‌కుమార్, హీరు రాథోడ్, ప్రేమ్‌సింగ్, విజయ్, నర్సింహులు, మల్లన్న, సునీల్ పాల్గొన్నారు.

జోగిపేటలో మాట్లాడుతున్న ఎంఈవో కృష్ణ

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

అందోల్, ఏప్రిల్ 25: విద్యాశాఖ ఆధ్వర్యంలో జోగిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని మండల విద్యాధికారి కృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరం వచ్చేనెల 13వరకు ఉంటుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో వ్యక్తిత్వ వికాసం, చదరంగం, ఇండోర్‌గేమ్స్, కుట్లు, అల్లికలు, కథలు చెప్పడం, చిత్రలేఖనం, యోగా, ధ్యానం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, సదాశివగౌడ్, సీఆర్పీలు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పోతారంలో....

జిన్నారం, ఏప్రిల్ 25: గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని చెట్ల పోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమ్మర్ క్యాంపును మండల ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యాశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 15 రోజులపాటు నిర్వహించే క్యాంపులో అన్ని విభాగాల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం విజయ్ కుమార్, సీఆర్పీలు, విద్యార్థులు, సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కల్హేర్, ఏప్రిల్ 25: నిత్యం మద్యం తాగితే ఆరోగ్యంతోపాటు సంసారం నాశనమవుతుందని, మద్యం మానివేయాలని భార్య మందలించడంతో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన దార సాయిలు (30) రోజూ మద్యం తాగుతూ భార్యాపిల్లలను పట్టించకోకుండా ఇష్టమొచ్చినట్లు తిరుగుతూ వ్యవసాయం పనులు పట్టించుకోక సంసారాన్ని నాశనం చేస్తున్నావని భార్య మందలించింది. దీంతో గురువారం కల్హేర్‌కు వెళ్లివస్తానని ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు.. కల్హేర్‌లోని పాఠశాలలో పురుగుల మందు తాగి పడి ఉండడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. అతడిని నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని, సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు రెఫర్ చేయగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడి భార్య ప్రేమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యువతి అదృశ్యం

జహీరాబాద్, ఏప్రిల్ 25:జహీరాబాద్‌లోని హమ్మద్ నగర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. హమ్మద్ నగర్‌కు చెందిన షాహిదా ఖాతున్(17) తన చెల్లలుతో కలిసి ఈనెల 23న కళాశాలకు వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు యువతి కోసం పరిసరా ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించ లేదు. శుక్రవారం యువచి తండ్రి మహ్మద్ రహమాత్ అల్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం, ఏప్రిల్ 25: ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఎర్లీ బర్డ్ పథకాన్ని ఉపయోగించుకొని, 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 30లోగా ఆస్తిపన్ను చెల్లించి ఐదు శాతం రాయితీని పొందాలని గడ్డపోతారం మున్సిపాలిటీ కమిషనర్ జైత్రం నాయక్ కోరారు. ఆస్తిపన్ను డిమాండ్ రూ.5.80 కోట్లకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 25 రోజుల్లో రాయితీ పరంగా రూ.1.71 కోట్ల పన్ను వసూలు చేసినట్లు కమిషనర్ తెలిపారు. దాదాపు 28 శాతం వసూలు చేసామన్నారు. ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని ఏప్రిల్ 30 లోగా పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సకాలంలో పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్వో మధుసూదన్ ఉన్నారు.

విగ్రహ ధ్వంసంపై విచారణ

జిన్నారం, ఏప్రిల్ 25: మండలకేంద్రంలోని తాంబేలు గుట్టపై శివుడి మట్టి విగ్రహం ధ్వంసమైన ఘటనలో అనుమానిత వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ వ్యవహారానికి సంబంధించి దాదాపు 30 మందిని విచారిస్తున్నారు. జిన్నారంలో 163 సెక్షన్ యథావిధిగా అమలు జరుగుతోంది. ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయి.

నేడు అవగాహన సదస్సు

రామచంద్రాపురం, ఏప్రిల్ 25: డివిజన్‌లోని లక్ష్మీగార్డెన్స్‌లో శనివారం భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అవగాహన సదస్సు ఉంటుందని, ఆర్సీపురం పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ఇతర వర్గాల ప్రజలందరూ పాల్గొన్నాలని సూచించారు. సదస్సుకు కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, ఏప్రిల్ 25: ఆర్సీపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్, చెట్ల కొమ్మల తొలిగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆర్సీపురం, అశోక్‌నగర్ ఏఈలు తిరుపతమ్మ, రాజేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆర్సీపురం, 11కేవీ ఎల్ఐజీ, హెచ్ఐజీ ఫీడర్‌ల్లో ఉదయం 9.30నుంచి 11.30 వరకు, 11కేవీ ఆర్ఆర్‌నగర్, అశోక్‌నగర్ ఫీడర్‌ల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

బీఆర్ఎస్‌లో చేరికలు

జహీరాబాద్, ఏప్రిల్ 25: న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బక్కారెడ్డి, పెంటరెడ్డిబీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చంద్రన్న, పార్టీ నాయకులు తుక్కారెడ్డి, ఎల్లారెడ్డి, మాణిక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

రాయికోడ్, ఏప్రిల్ 25:వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విఠల్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాయికోడ్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సమావేశానికి మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతారని, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, చంటి రాహుల్ కిరణ్ నేతృత్వంలో మండలం నుంచి పెద్ద ఎత్తున సభకు తరలిరావాలన్నారు. 27వ ఉదయం 10 గంటలకు రాయికోడ్‌లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు హాజరు కావాలన్నారు.

భూ భారతిపై రైతులకు అవగాహన

కోహీర్, ఏప్రిల్ 25:భూ సమస్యల పరిష్కారానికి తెచ్చిన భూ భారతి చట్టంతో రైతులకు ఎంతగానో మేలు కలుగుతుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం కోహీర్‌లోని భారత్ ఫంక్షన్ హాలులో రైతులకు భూభారతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకంలో యజమాని పేరు తప్పుగా ఉంటే వెంటనే సరి చేసేందుకు వీలవుతుందన్నారు. పౌతి కూడా 30రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. రైతులకు భూమిపై హక్కు ఉంటేనే సబ్సిడీలు, బ్యాంకు రుణాలు వస్తాయ న్నారు. నిర్ణీత కాలపరిమితిలో పనులు చేయాల్సి ఉం టుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆర్డీవో రాంరెడ్డి, తహసీల్దార్ బాలశంకర్, డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, ఆర్ఐ సత్యనారాయణ, ఎంపీడీవో భారతి ఉన్నారు.

కోహీర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఝరాసంగం, న్యాల్‌కల్‌లో....

ఝరాసంగం/ జహీరాబాద్, ఏప్రిల్ 25: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూభారతిపై రైతులకు పరిపూర్ణమైన అవగాహన ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం ఝరాసంగం, న్యాల్‌కల్‌లో భూభారతిపై అవగహన కల్పించారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి ప్రతి ఏడాది గ్రామాల్లో రికార్డును డిస్ప్లే చేస్తాన్నారు. భూముల సమాచారం, జీపీఎస్ ప్రక్రియతో మరోసారి సర్వేచేసి సరిహద్దులు నిర్ణయిస్తామని చెప్పారు. ఇక నుంచి అన్ని పత్రాలు పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతనే రిజిస్ట్రేషన్ విధానం ముగుస్తుందన్నారు. భూ భారతిలో ఎలాంటి లోపాలున్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. భూసమస్యలపై చేసే దరఖాస్తుల్లో తప్పులను నివారించడానికి కలెకరేట్లో, ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ చట్టంలోని ప్రతి అంశాన్ని రైతులకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. అనంతరం మేదపల్లికి చెందిన నర్సింహులు చిల్కేపల్లి, కుప్పానగర్, మాచ్నూర్ కొల్లూర్ గ్రామాల శివారులో ఎర్రమట్టి గుట్టలను తవ్వి ప్రైవేట్ వెంచర్లకు తరలిస్తున్నారని తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలంటూ కలుక్టర్‌కు విన్నవించారు. ఎల్లోయిలో 24 గుంటల శ్మశాన వాటికకు సంబంధించిన భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, దానిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఆర్డీవోకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా వారికి నోటీసుల భయం చూపించి డబ్బులు వసూలు చేశారని దిడ్గి వీర్‌శెట్టి పటేల్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి, ఏడీఏ భిక్షపతి, మండల ప్రత్యేకాధికారి లలితకుమారి, తహసీల్దార్లు తిరుమలరావు, భూపాల్. నాయబ్ తహసీల్దార్లు కరుణకర్‌రావు, రాజిరెడ్డి, కేతకీ ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పటేల్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, హన్మంత్‌రావు పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ అవగాహన

జహీరాబాద్, ఏప్రిల్ 25: భూభారతిపై అవగాహన ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం న్యాల్‌కల్‌లోని బీబీసీ ఫంక్షన్ హాల్‌లో భూభారతి చట్టంపై ఆమె మాట్లాడారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాదిలోగా భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. సమస్యలు పరిష్కరం కానీ రైతులు కలెక్టర్ లేదా సీసీఎల్ఏకు అప్పీల్ చేసుకోవచ్చాన్నారు. ఈ చట్టంలో ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటలో ఉంటుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు పరిపాలన అధికారులను నియమి స్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురీ, ఆర్డీవో రాంరెడ్డి, సెట్విన